క్లుప్తంగా

ఘనంగా వసంతోత్సవం



వసంతోత్సవం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

గుత్తి: గుత్తిలో దసర ఉత్సవాల ముగింపు సందర్భాన్ని పురస్కరించుకుని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం వసంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష, కార్యదర్శులు మాకం శ్రీకాంత్, కిశోర్ బాబు, నాగ సుదర్శన్ ఆధ్వర్యంలో ఆ సంఘం సభ్యులు, యువజన సంఘం సభ్యులు వసంతోత్సవం చేపట్టారు. అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీలో ఉంచి ఊరేగించారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని ఆనందంతో చిందులు వేయడంతో పాటు నృత్యం చేశారు.

ఘనంగా గంధం ఉరుసు

గార్లదిన్నె: మండలంలోని కల్లూరులో సోమవారం రాత్రి హజరత్ మహబూబ్ సుబహానీ స్వామి గంధం ఉరుసు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జామియా మజీద్ కమిటీ సభ్యులు గంధం బిందెలను పూలమాలతో అలంకరించి స్వామి జెండాతో పాటు గంధాన్ని గ్రామంలో ఊరేగించారు. అనంతరం జెండా చెట్టు వద్ద జెండాలను ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో ముస్లింలు, హిందువులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేయండి

పామిడి: పట్టణంలో రెండు ఆధార్‌కేంద్రాలు ఏర్పాటు చేయాలని పామిడి యువతబృందం సూర్యనారాయణ, రామాంజనేయులు, వీరప్రతాప్, సురేష్, నరేష్, రాజు, సతీష్, రామ్ తదితరులు తహసీల్దార్ శ్రీధర్‌మూర్తికి సోమవారం విన్నవించారు. ఆధార్‌కార్డు అప్‌డేట్ కోసం మండలేతర గ్రామాలకు వెళ్లాల్సి వస్తోందన్నారు. పామిడిలోనే ఆధార్‌కేంద్రాలను ఏర్పాటుచేసి సమస్యలను అధిగమించాలని కోరారు.ఇందుకు తహసీల్దార్ సానుకూలంగా స్పందించారు. అలాగే భూ ఆన్‌లైన్ నమోదులో అవకతవకలు, సర్వేతో భూమి హద్దుల కేటాయింపు తదితర సమస్యలపై ప్రజలు గ్రీవెన్స్‌లో అధికారులకు అర్జీలు సమర్పించారు.

అవినీతి, అక్రమాలు నిగ్గుతేల్చాలి

గుంతకల్లు రూరల్: వరద బాధితుల సహాయనిధిలో జరిగిన అవినీతి, అక్రమాలు నిగ్గు తేల్చాలని కోరుతూ సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు సోమవారం తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కమిటీ కార్యదర్శి బీ.సురేష్ మాట్లాడుతూ సెప్టెంబర్ మొదటి వారంలో భారీ వర్షాలకు విజయవాడ ప్రాంతంలో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయన్నారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు వెంటనే ముందుకు వచ్చి వివిధ రకాలుగా సహాయ కార్యక్రమాలను చేపట్టాయని, అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధికి సుమారు రూ.500 కోట్లు జమయ్యాయన్నారు. వరద సహాయక చర్యల్లో విజయవంతం అయ్యామని గొప్పలు చెప్పుకుంటున్న ప్రభుత్వం బాధితులకు ఏమి చేయలేకపోయిందన్నారు. ముఖ్యమంత్రి సహాయ నిధికి అందిన మొత్తంలో భారీ ఎత్తున అవినీతి అక్రమాలు జరిగాయని, వెంటనే విచారణ జరిపించి వాటి నిగ్గు తేల్చాలని వారు డిమాండ్ చేశారు.

ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరగాలి



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లుటౌన్: క్లీన్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలో ఇంటింటా చెత్త సేకరణ సక్రమంగా జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ వార్డు శానిటరీ సెక్రటరీలకు సూచించారు. సోమవారం ఉదయం పట్టణంలోని 60 అడుగుల రోడ్డు, మార్కెట్‌యార్డు, ఆలూరు రోడ్డు ఏరియాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. చెత్తను డ్రైనేజీలు, రోడ్లపై పడేయరాదని, చెత్త ఆటోలకు మాత్రమే చెత్తను అందివ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలో పారిశుధ్యం మెరుగుపరిచేందుకు అందరూ సహకరించాలన్నారు.

17న శ్రీసార్థ జ్ఞానేశ్వరి పవిత్ర గ్రంథ ఆవిష్కరణ

పామిడి: పట్టణంలోని పెద్ద విఠోబ దేవాలయ నూతన ప్రాంగణంలో ఈ నెల 17న డబ్బేదార్ ఫిర్కా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీసార్థ జ్ఞానేశ్వరి (అధ్యాయాలు 9,12) పవిత్రగ్రంథ మహోత్సవ ఆవిష్కరణ పూజా కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆ ఫిర్కా నిర్వాహకులు సోమవారం తెలిపారు. పండరీపురం చైతన్య సద్గురు గోపాల్ తుకారాం వాస్కర్ మహరాజ్‌చే ఈ పవిత్రగ్రంథ ఆవిష్కరణ ఉంటుందన్నారు.

తాళం వేసిన ఇళ్లే టార్గెట్!

- నెల రోజుల వ్యవధిలో ఐదుకుపైగా దొంగతనాలు
- రూ.40 లక్షలు విలువ చేసే బంగారం, రూ.7 లక్షల నగదు అపహరణ
- గస్తీ మరిచిన పోలీసులు



కాకర్ల రంగనాయకుల ఇంట్లో వేలి ముద్రలు సేకరిస్తున్న పోలీసులు (ఫైల్)



గుంతకల్లు: పట్టణంలో రోజు రోజుకూ చోరీలు పెరిగిపోతున్నాయి. పోలీసుల వైఫల్యంతోనే చోరీ ఘటనలు చోటుచేసుకుంటున్నాయని బాధితులు ఆరోపిస్తున్నారు. గత సెప్టెంబర్ 18 నుంచి ఇప్పటి వరకూ గుంతకల్లు పట్టణంలోనే ఐదుకుపైగా చోరీలు జరిగి దాదాపు రూ.40 లక్షలు విలువ చేసే 55 తులాల బంగారంతోపాటు రూ.7లక్షలు నగదు ఎత్తుకెళ్లారు. తాళం వేసిన ఇళ్లు, సీసీ కెమెరా లేని ఏరియాలు దొంగల టార్గెట్‌గా మారాయి. అలాగే బ్యాంకుల నుంచి పెద్ద మొత్తంలో నగదు డ్రా చేసే ఒంటరి వ్యక్తులను కూడా దొంగలు టార్గెట్ చేస్తున్నారు. గత ఏడాది కాలంలో పోలీసులు ఒక్క కేసును కూడా ఛేదించకపోవడంతో రికవరీలు కుప్పలు తెప్పలుగా పడిఉన్నాయి.

తాళం వేస్తే.. ఇళ్లు లూటీ

దొంగతనాలు చేస్తున్న దుండగులు తాళం వేసిన ఇళ్లనే టార్గెట్ చేస్తున్నారు. దొంగలు పగటి పూట ఏరియాల్లో గస్తీ నిర్వహించి తాళం వేసిన ఇళ్లను గుర్తిస్తున్నారు. అ తరువాత రాత్రి పూట ఇళ్లల్లోకి ప్రవేశించి దొంగతనాలకు పాల్పడుతున్నారు. ఈ నెల 11న హనుమేష్ నగర్‌లోని బీసీ హాస్టల్ సమీపంలోని ఓ ఇంట్లో పైభాగంలో అద్దెకు ఉంటున్న కాకర్ల రంగనాయకులు ఆరోగ్య పరీక్షల కోసం అనంతపురం వెళ్లాడు. దీన్ని అసరాగా తీసుకున్న దొంగలు ముందుగా కింద ఇంట్లో వారు ఉన్న విషయం గుర్తించి అ ఇంటికి బయట డోర్‌కు లాక్ చేసి దొంగతనం చేశారు. ఈ ఇంట్లో దాదాపు 10 తులాల బంగారం అభరణాలు, రూ.1.20 లక్షలు నగదును ఎత్తుకెళ్లారు. ఈ నెల 4న కసాపురం రోడ్డులోని సాయినాథ్ గౌడ్ కాలనీలో విహార యాత్రకు వెళ్లిన రైల్వే ఉద్యోగి టీటీ జయచంద్ర, ఆయన భార్య మున్సిపల్ టీచర్ సుమ ఇంట్లో చొరబడిన దొంగలు 45 తులాల బంగారం, 20 తులాల వెండి, రూ.25 వేలు నగదు ఎత్తికెళ్లారు. సెప్టెంబర్ 17న వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు కూతవేట దూరంలోని గోవిందు టీ స్టాల్‌లో రూ.1.20 లక్షలు నగదు ఎత్తికెళ్లారు. ఈ దొంగతనం చేస్తున్న దృశ్యాలు సీసీ ఫుటేజీలో రికార్డయ్యాయి. సెప్టెంబర్ 24న పాత బస్టాండ్ సమీపంలోని హైదరాబాద్ రెస్టారెంట్ ఎదురుగా ఖాన్ జిమ్స్ వద్ద చంఫీజ్‌ఖాన్‌కు ద్విచక్రవాహనం ముందు భాగంలో ఉంచిన రూ.1.20 లక్షల నగదును అదును చూసిన దుండగుడు కొట్టేశాడు. ఇదే తరహాలో సెప్టెంబర్ 30న టీచర్ వేణుగోపాల్ రెడ్డి ద్విచక్రవాహనం సైడ్ బ్యాగ్‌లో ఉంచిన రూ.3 లక్షల నగదును పాత క్రౌన్ థియేటర్ సందులో కాజేశారు. ఈ రెండు సంఘటనలు పట్టపగలే చోటు చేసుకున్నాయి. మొత్తం మీద ఇళ్లు వదలి బయటకు వెళ్లాలంటే దొంగల దెబ్బకు గుంతకల్లు వాసులు హడలెత్తిపోతున్నారు.

చోద్యం చూస్తున్న పోలీసులు

ఇటీవల పట్టణంలో రాత్రి వేళ పోలీసుల గస్తీ అస్సలు కనిపించడం లేదు. గతంలో కనీసం అప్పుడప్పుడైనా పెట్రోలింగ్‌కు వచ్చే పోలీసుల విజిల్స్, వాహనాల సైరన్‌లు వినిపించేవి. ప్రస్తుతం రాత్రి గస్తీ మృగ్యమైంది. ఇందుకు చాలా కారణాలే ఉన్నాయి. గుంతకల్లు పట్టణంలోని 37 వార్డుల్లో దాదాపు 1.60 లక్షలు పైగా జనాభా ఉంది. వీటిలో దాదాపు 30 వార్డులు పట్టణ ఒకటో, రెండో పోలీసు స్టేషన్ల పరిధిలోనికి వస్తాయి. ఇక కసాపురం పోలీసుస్టేషన్ పరిధిలో నాలుగు వార్డులు, మరో మూడు వార్డులు రూరల్ పోలీసుస్టేషన్ పరిధిలోకి వస్తాయి. దీంతో వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌కు ఇద్దరు ఎస్‌ఐలు, టూటౌన్‌కు ఒక ఎస్‌ఐ ఉండాలి. అయితే ప్రస్తుతం ఈ రెండు స్టేషన్లకు అస్సలు ఒక్క ఎస్‌ఐ కూడా లేరు. అంతేకాకుండా రెండు పోలీసుస్టేషన్లలో దాదాపు 16 కానిస్టేబుళ్ల కొరత ఉంది. వీరు కూడ చాలా మందిని వీఐపీల భద్రత, కోర్టు డ్యూటీలు, ఇతర ప్రాంతాల్లో జరిగే ఉత్సవల డ్యూటీలకు వేస్తున్నారు. ఫలితంగా పట్టణంలో నామమాత్రపు పోలీసింగ్ కనిపిస్తోంది. పట్టణంలో నెలకొన్న పోలీసుల కొరత దొంగలకు వరంగా మారింది. ఫలితంగా ప్రజల కష్టార్జితం దొంగల పాలవుతోంది.

ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం



దొంగతనాలు అరికట్టేందుకు వన్‌టౌన్, టూటౌన్ పరిధిలో ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. త్వరలోనే దొంగలను పట్టుకుని చోరీకి గురైనా సొత్తు రికవరీకి చేస్తాం. సిబ్బంది కొరత విషయాన్ని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకెళ్లగా ఇప్పటికే గుత్తికి ఒక ఎస్‌ఐను నియమించారు. త్వరలోనే వన్‌టౌన్, టూటౌన్ పోలీసుస్టేషన్లకు కూడా ఎస్‌ఐలను నియమిస్తాం. ప్రజలు కూడా అప్రమత్తం ఉండాలి. ఊరెళ్లేటప్పుడు ఆభరణాలు, నగదు ఇంట్లో ఉంచకుండా తెలిసిన వారి ఇళ్లల్లో లేదా బ్యాంకుల్లో పెట్టి వెళ్లాలి. అలాగు మీ పరిధిలోని పోలీసుస్టేషన్లలకు సమాచారం ఇస్తే రహస్య కెమెరాలను ఏర్పాటు చేయడంతోపాటు బీట్ పోలీసుచే ప్రత్యేక నిఘా పెడుతాం.

– ఆముదాల శ్రీనివాస్, డీఎస్పీ, గుంతకల్లు

సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ అలీ



గుత్తి: గుత్తి నూతన సబ్ రిజిస్ట్రార్‌గా మహబూబ్ అలీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న గురునాథ్ శింగనమలకు బదిలీ అయ్యారు. అనంతపురం రూరల్‌లో పని చేస్తున్న మహబూబ్ అలీని ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన మహబూబ్ అలీని డాక్యుమెంట్ రైటర్లు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది కలసి శుభాకాంక్షలు తెలిపారు.

ఇన్‌చార్జ్ డీటీగా మారుతీప్రసాద్‌రెడ్డి



యాడికి: మండల సివిల్ సప్లై ఇన్‌చార్జ్ డిప్యూటీ తహసీల్దార్‌గా మారుతీప్రసాద్‌రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ గుత్తి మండలానికి చెందిన సివిల్ సప్లై డీటీ సూర్యనారాయణ ఇన్‌చార్జ్‌గా విధులు నిర్వహిస్తుండగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మారుతీప్రసాద్ రెడ్డి యాడికిలో ఇన్‌చార్జ్ సివిల్ సప్లై డీటీగా బాధ్యతలు చేపట్టారు. ఈయన అనంతపురంలో రెగ్యులర్ డీటీగా విధులు నిర్వహిస్తున్నారు.

మద్యం షాపులకు లాటరీ

యాడికి: అనంతపురంలోని జేఎన్‌టీయూ కాలేజీలో సోమవారం జరిగిన మద్యం ఓపెన్ లాటరీలో యాడికి మండలంలోని ఎంపీటీసీ సభ్యుడు గొడ్డుమర్రి రామ్మోహన్‌కి దక్కింది. మండలంలోని 68, 69, 70, 71 నంబర్ గల వైన్ షాపులకు మండల వ్యాప్తంగా 53 మంది దరఖాస్తు చేసుకున్నారు. వారిలో యాడికి నంబర్ 2 ఎంపీటీసీ సభ్యుడు గొడ్డుమర్రి రామ్మోహన్ 4 దరఖాస్తులు, యాడికి ఉప సర్పంచు కాసా చంద్రమోహన్ 1, నాయకుడు బాలిరెడ్డి 1 దరఖాస్తు చేసుకున్నారు. అనంతపురంలో జరిగిన లాటరీలో 68, 69వ షాపులను యాడికి మండలంలోని పుప్పాల తాండా గ్రామానికి చెందిన రాముానాయక్, 70వ షాపును యాడికి మండలంలోని నం:2 ఎంపీటీసీ సభ్యుడు గొడ్డుమర్రి రామ్మోహన్, 71వ షాపు మండలంలోని టి.కొత్తపల్లికి చెందిన సుగుణ దక్కించుకున్నారు.

యల్లనూరు: మండల కేంద్రంలోని మద్యం షాపు పుట్లూరు మండలం మడ్డిపల్లి గ్రామానికి చెందిన పట్నం సుధాకర్‌రెడ్డిని వరించింది. మండలంలో ఉన్న ఒక్క మద్యం దుకాణానికి 22 మంది వ్యక్తులు పోటీ పడగా.. లాటరీలో మద్యం దుకాణం సుధాకర్‌రెడ్డికి దక్కింది.

అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

గుత్తి: భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని, వర్ష బాధితుల కోసం మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మూడు రోజుల పాటు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ ప్రకటించిన నేపథ్యంలో కంట్రోల్ రూము ఏర్పాటు చేశామన్నారు. భారీ వర్షాల వల్ల ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎవరికైనా వర్షాల కారణంగా సమస్య తలెత్తితే వెంటనే కంట్రోల్ రూం(9100986895) ను సంప్రదించాలన్నారు.

చెరువు పరిశీలన



పుట్లూరు సమీపంలోని చెరువులో నీటి నిల్వను పరిశీలిస్తున్న ఎంపీడీఓ అలివేలమ్మ

పుట్లూరు: మండల కేంద్రం సమీపంలోని చెరువును సోమవారం ఎంపీడీఓ అలివేలమ్మ పరిశీలించారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో చెరువులో ప్రస్తుత నీటిమట్టం, వర్షాల వల్ల నీటి చేరిక అనంతరం పరిస్థితిపై ఆమె రెవిన్యూ అధికారులను ఆరా తీశారు. చెరువులో నీటి మట్టం తక్కువగా ఉండటంతో వర్షాల వల్ల నీటి చెరువులో నిల్వ ఉండటానికి ఇబ్బందులు ఉండవన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సంధ్య, వీఆర్‌ఓ వెంకటనారాయణ తదితరులు ఉన్నారు.

జాగ్రత్తగా ఉండాలి

యల్లనూరు: తుపాను కారణంగా అందరూ అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు సూచించారు. సోమవారం వారు మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఆయా పంచాయతీల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యదర్శులకు కేటాయించిన పంచాయతీల్లో రాత్రి బస చేయాలని ఆదేశించారు.

ఆటో అపహరణ

తాడిపత్రి: పట్టణంలోని నూతన కూరగాయల మార్కెట్ వద్ద ఆపి ఉంచిన ఆటోను గుర్తుతెలియని వ్యక్తులు అపహరించారు. మండలంలోని అయ్యవారిపల్లికి చెందిన డ్రైవర్ గంగినాయుడు ఆటో తోలుకుంటూ జీవనం సాగించేవాడు. సోమవారం ఉదయం కూరగాయలు కొనుక్కునే క్రమంలో మార్కెట్ బయట ఆటో నిలిపాడు. మార్కెట్‌లో కూరగాయలు కొనుగోలు చేసిన అనంతరం తిరిగి వచ్చి చూడగా ఆటో కనిపించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. అలాగే పట్టణంలోని క్రిష్టాపురం మూడో రోడ్డుకు చెందిన నాగార్జున అనే వ్యక్తికి చెందిన ఆటో గత ఫిబ్రవరిలో చోరీకి గురైంది. చోరీ ఘటనపై బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

ద్విచక్ర వాహనం అపహరణ

గుత్తి: గుత్తి ఆర్‌ఎస్‌లోని రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద ఆదివారం రాత్రి బాబు అనే వ్యక్తి పార్క్ చేసి ఉంచిన పల్సర్ బైక్ చోరీకి గురైంది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తిపై కేసు నమోదు

తాడిపత్రి: మారణాయుధాలను కలిగి ఉన్న వ్యక్తిపై పట్టణ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పట్టణంలోని పోరాటకాలనీకి చెందిన రామాంజనేయులు అలియాస్ బిజిలీ అనే వ్యక్తి ఇంట్లో మారణాయుధాలు కలిగి ఉన్నాడన్న సమాచారంతో పోలీసులు దాడి చేశారు. ఇంట్లో మారణాయుధాలైన కత్తులు, రాడ్లు గుర్తించారు. నిందితుడిని అరెస్ట్ చేసి, కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

పరామర్శ

గార్లదిన్నె: మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త చీలేపల్లి చంద్రాయుడు తల్లి లక్ష్మమ్మ(67) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ జిల్లా నాయకుడు సాంబశివారెడ్డి, మండల కన్వీనర్ నరేంద్రరెడ్డి, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్ రెడ్డి తదితరులు మృతదేహంపై పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మనోహర్‌రెడ్డి, జంబులదిన్నె సొసైటీ మాజీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, గట్టు రామక్రిష్ణరెడ్డి, ఎంపీటీసీ రామచంద్ర , గుత్తా కేశవ తదితరులు పాల్గొన్నారు.

కబ్జాదారుడి నుంచి మా స్థలాలు కాపాడండి



జిల్లా ఎస్పీ కార్యాలయం వద్ద బాధితులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: కష్టార్జితంతో కొన్న ఇంటి స్థలాలను కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్న వ్యక్తి నుంచి తమ స్థలాలను కాపాడాలని జిల్లా ఎస్పీ జగదీష్‌కి బాధితులు సోమవారం ఫిర్యాదు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. గుంతకల్లు పట్టణంలోని పారిశ్రామిక వాడ సమీపంలోని దాదాపు 12 ఎకరాలను ఆ భూముల యాజమాని గతంలో ప్లాట్లు వేసి విక్రయించాడు. దాదాపు 780 మంది పేద, మధ్యతరగతి ప్రజలు వాటిని కొనుగోలు చేశారు. రిజిస్ట్రేషన్ కూడా పూర్తయింది. అయితే తెలంగాణా రాష్ట్రం నారాయణపేట జిల్లా మక్తల్‌కు చెందిన పాటిల్ భరత్‌సింహారెడ్డి అకస్మాత్తుగా రంగంలోకి వచ్చి ప్లాట్లు వేసిన 12 ఎకరాలను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. ఆ మొత్తం భూమి తనదే అని వాదిస్తూ గత ఆగస్టు 26న ఏకంగా జేసీబీలు పెట్టి హల్‌చల్ చేశాడు. స్థలాల్లో పాతిన సర్వే నంబర్ రాళ్లను జేసీబీతో తొలిగించాడు. ట్రాక్టర్‌తో ప్లాట్లు దున్నేశాడు. స్థలాల్లో అడుగుపెట్టకుండా ఉండాలంటే పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లించాలని భరత్‌సింహారెడ్డి తమను డిమాండ్ చేస్తున్నట్లు బాధితులు వాపోయారు. తనకున్న రాజకీయ పలుకుబడితో ఏమైనా చేయగలనని హెచ్చరించాడని, న్యాయం చేయాలని బాధితులు ఎస్పీకి వినతిపత్రం అందజేశారు.

ఇసుక అక్రమ తరలింపుపై ఆందోళన



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

తాడిపత్రి రూరల్: ఇసుక తరలింపులో అధికారులు చూపుతున్న నిర్లక్ష్యంపై సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. సీపీఐ తాడిపత్రి నియోజక వర్గ కార్యదర్శి రంగయ్య మాట్లాడుతూ తాడిపత్రి ప్రాంతం వాసులకు వరప్రసాదమైన పెన్నానదిలో ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా పెద్ద ఎత్తున ఇసుక తరలించడంతో భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయన్నారు. దీంతో పరిశ్రమల నిర్వాహకులు, రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇసుక అక్రమ రవాణా అరికట్టడంతో పాటు పేదలకు ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ రజాక్‌వలికి అందజేశారు. ఆందోళనలో సీపీఐ నాయకులు పురుషోత్తం, రామేశ్వరరెడ్డి, రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, నాగరంగయ్య రామాంజనేయులు, లింగమయ్య, గంగావతి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

గుంతకల్లుటౌన్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వన్‌టౌన్ సీఐ బి.మనోహర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆయన సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే లింకులు, ఏపీకే ఫైళ్లను క్లిక్ చేస్తే సైబర్ బూచోళ్లు బ్యాంకు ఖాతాల్లోని డబ్బును దోచేస్తారన్నారు. మీ ఫోన్ బ్లాక్ అయ్యిందని, మీ బ్యాంక్ ఖాతా క్లోజ్ అయ్యిందని, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ ఆఫర్ కార్డులని, మీ కరెంట్ కనెక్షన్ కట్ అయ్యిందని, ఈ–కేవైసీ అప్‌డేట్ చేసుకోవాలని, ఆధార్ అప్‌డేట్ చేసుకోవాలని వచ్చే లింకులను క్లిక్ చేయొద్దన్నారు. ఏపీకే ఫైళ్లను డౌన్‌లోడ్, ఇన్‌స్టాల్ చేసినట్లయితే మీ ఫోన్ కంట్రోల్ మొత్తం నేరస్తుల చేతుల్లోకి వెళ్తుందని, మీ మొబైల్‌లోని బ్యాంక్ యాప్‌ల నుంచి డబ్బులను మీకు తెలియకుండానే నొక్కేస్తారన్నారు. సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కి కాల్ చేయాలని లేదా డబ్ల్యూడబ్ల్యూ డబ్ల్యూ.సైబర్‌క్రైమ్.జీఓవీ.ఇన్‌లో కంప్లెయింట్ రిజిస్టర్ చేసుకోవాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

వన్నేదొడ్డిలో 'పొలంబడి'



వేరుశనగ విత్తనాలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్త, వ్యవసాయాధికారులు

గుత్తి రూరల్: మండలంలోని వన్నేదొడ్డి గ్రామంలో సోమవారం వ్యవసాయాధికారులు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. గ్రామానికి చెందిన రైతులు సేంద్రీయ ధ్రువీకరణ ప్రక్రియ (ఆర్గానిక్ సర్టిఫికేషన్) కోసం దరఖాస్తు చేసుకోవడంతో పంట పొలాలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. రెడ్డిపల్లి వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ కాత్యాయని, గుత్తి ఏడీఏ వెంకట్రాముడు సేంద్రీయ వ్యవసాయం ద్వారా రైతులు పండించిన వేరుశనగ విత్తనాలను పరీక్షించారు. సేంద్రీయ ధ్రువీకరణ ప్రక్రియ కోసం రైతులు పొలంలో తొలగించిన కొంత పంటను పంపినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ముస్తాక్ అహ్మద్, ఏఈఓ శ్రీనివాస్, వీహెచ్‌ఏలు అజయ్, మద్దిలేటి, హుస్సేనమ్మలు పాల్గొన్నారు.

గ్రామాల్లో 'పల్లె పండుగ'

గుంతకల్లు రూరల్/గుత్తిరూరల్/పుట్లూరు/బుక్కరాయసముద్రం/యల్లనూరు/పామిడి/గార్లదిన్నె/శింగనమల: గుంతకల్లు మండలంలోని దంచర్ల, నక్కనదొడ్డి, తిమ్మాపురం, నెలగొండ గ్రామాల్లో సోమవారం అధికారులు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో నూతనంగా మంజూరైన సీసీరోడ్లకు సంబంధించిన శిలాఫలకాలను ఆవిష్కరించారు. గ్రామసభలు నిర్వహించి ఆ గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీకాంత్ చౌదరి, అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.గుత్తి మండంలోని యంగన్నపల్లి, ధర్మాపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లె పండుగ గ్రామంలో ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్, ఈఓఆర్డీ శివాజీరెడ్డి, పీఆర్ ఏఈ మల్లేష్‌నాయక్, కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు. పుట్లూరు మండలంలోని కందికాపుల, కొండాపురం, సూరేపల్లి, కొండాపురం గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ అలివేలమ్మ, ఉపాధి హామీ సిబ్బంది సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. అలాగే బీకేఎస్ మండల కేంద్రంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ పార్వతి, ఎంపీపీ సునీత అధ్యక్షతన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ శ్రీదేవి, ఏపీడీ అనూరాధ, ఎంపీడీఓ సల్మాన్ రాజు, పీఆర్ ఏఈ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యూ ఏఈ నాగేంద్ర, ఈఓఆర్డీ సదాశివం, ఏపీఓ పోలేరయ్య, పంచాయతీ సెక్రటరీ శ్రీనివాసులు, ఈసీ శివరామక్రిష్ణ, పసుపుల శ్రీరామిరెడ్డి, బుల్లే నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు. యల్లనూరు మండలంలోని వేములపల్లి, నిట్టూరు, పెద్దమల్లేపల్లి గ్రామాల్లో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ వాసుదేవరెడ్డి, ఈఓఆర్డీ మనోహర్‌బాబు, ఏపీవో షబ్బీర్‌బాషాల ఆధ్వర్యంలో పల్లె పండుగ నిర్వహించారు. కార్యక్రమంలో నిట్టూరు సర్పంచు వనం శారద, కాంట్రాక్టర్లు, నాయకులు పాల్గొన్నారు. పామిడి మండలంలోని నీలూరు, అనుంపల్లి, దిబ్బసానిపల్లి, పాళ్యం, రామగిరి, రామరాజుపల్లి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమంలో మండల స్పెషలాఫీసర్ శ్రీనివాసరెడ్డి, ఎంపీడీఓ కే తేజోష్ణ , సర్పంచ్‌లు నారాయణస్వామి, రామాంజనేయులు, డీఈ మురళీధర్, ఈఓఆర్డీ కృష్ణకుమార్, పంచాయతీ కార్యదర్శి షామీర్, టీడీపీ నాయకులు ఆర్‌ఆర్ రమేష్, ముసలిరెడ్డి, రాజేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రం గార్లదిన్నెతో పాటు ఇల్లూరు గ్రామ పంచాయతీల్లో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో ఎంపీడీఓ యోగానందరెడ్డి , అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. అదేవిధంగా పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా సోమవారం శింగనమలలో సీసీ రోడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణానికి తహసీల్దార్ బ్రహ్మయ్య, ఎంపీడీఓ నిర్మలాకుమారి భూమిపూజ నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఈ పనులు చేపడుతున్నట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ విజయ, ఏపీఓ శ్రీదేవి, పంచాయతీ కార్యదర్శి లీలారాణి, వీఆర్వో తాతయ్య, ఇంజినీరింగ్ అసిస్టెంట్ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

బస్సు యాత్ర విజయవంతం చేయండి

శింగనమల: సాగు నీటి సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 15 నుంచి 21వ తేదీ వరకూ సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టే బస్సు యాత్ర విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. సోమవారం ఆయన మాట్లాడుతూ బస్సు యాత్ర 15వ తేదీ బొమ్మహాళ్ల నుంచి ప్రారంభమవుతుందని, ఈ నెల 17న శింగనమల మండలంలోకి ప్రవేశిస్తుందన్నారు. కల్లూరు నుంచి కల్లుమడి, తరిమెల గ్రామాలకు చేరుకొని, పెద్దవడుగూరు మండలం చిట్టూరుకు వెళ్తుందన్నారు. 18వ తేదీ నార్పల మండల మీదుగా కొర్రపాడు మీదుగా శింగనమలకు వస్తుందన్నారు. 21వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని, రైతులు, ప్రజలు తరలిరావాలని ఆయన కోరారు.

మట్కా బీటర్ అరెస్ట్

యల్లనూరు: మండలంలోని తిమ్మంపల్లికి చెందిన లడ్డుశెట్టి సురేష్ మట్కా రాస్తుండగా అరెస్టు చేశామని ఎస్‌ఐ రాంప్రసాద్ తెలిపారు. అతడి నుంచి మట్కా పట్టీలతో పాటు రూ.20 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే మండలంలోని మట్కా బీటర్లు కొడవండ్లపల్లి మహేష్, తిమ్మంపల్లి లడ్డుశెట్టి సురేష్, మల్లాగుండ్ల శేఖర్, గడ్డంవారిపల్లి గంగరాజును తహసీల్దారు సీనియర్ సహాయకుడు వాసుదేవరావు వద్ద బైండోవర్ చేశామని ఎస్‌ఐ తెలిపారు.